సాక్షి
తిరుపతి
మంగళవారం । 10 । జూన్ । 2025



ఒకే బస్సు.. నలభై అడుగుల రోడ్డు!

చంద్రగిరి మండలం ఐతేపల్లెలో అధికారులు ఇష్టారాజ్యంగా జేసీబీలతో పలువురి ఇళ్లు, దుకాణాలు కూల్చివేశారు. - 8లో



రమణీయం..రథోత్సవం

శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. - 8లో



బత్తినయ్య సేవలో మోహన్‌బాబు

ఏర్పేడు మండలం మునిలిపేడు సమీపంలోని బత్తినయ్య కోనకు మోహన్‌బాబు కుటుంబం వెళ్లి ప్రత్యేక పూజలు చేసింది. - 8లో

న్యూస్‌రీల్

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్ : గుంటూరు జిల్లాలోని ఏఎన్‌యూ మైదానంలో ఈ నెల 14, 15 తేదీల్లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి సీనియర్ బాలబాలికల అథ్లెట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపిక పోటీలను బుధవారం ఉదయం 7గంటలకు తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ మైదానంలో నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీలకు 27-07-2007లోపు జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 86868 67079ను సంప్రదించాలని ఆయన కోరారు.

పీజీ సెట్‌కు 81శాతం హాజరు



పరీక్షలను ప్రారంభిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ప్రారంభమైన ఏపీ పీజీ సెట్-2025లో భాగంగా తొలి రోజు నిర్వహించిన 17 సబ్జెక్టుల ప్రవేశ పరీక్షలకు 81 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీజీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన పరీక్షలను సెట్ చైర్మన్, వీసీ సీహెచ్ అప్పారావు లాంఛనంగా ప్రారంభించారని చెప్పారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు ప్రశ్నపత్రాల కోడ్‌ను అప్‌లోడ్ చేశారని వెల్లడించారు. 14 కేంద్రాల్లో మూడు సెషన్లలో ఇంగ్లిష్, సంస్కృతం, తమిళం, లలిత కళలు, సెరికల్చర్, పాలిమర్ సైన్స్, జనరల్, హిందీ, ఉర్దూ, ప్రదర్శన కళలు, హిస్టరీ, ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్, జియాలజీ, తెలుగు, ఫుడ్ అండ్ న్యూట్రీషన్, స్టాటిస్టిక్స్ ప్రవేశ పరీక్షలు పూర్తయ్యాయని వివరించారు. కార్యక్రమంలో కో-కన్వీనర్ ప్రొఫెసర్ సురేంద్రబాబు పాల్గొన్నారు.

అపోహలు సృష్టించి.. అరాచకం

కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. ప్రజల తరపున ప్రశ్నించే పత్రికపై కక్షగట్టింది. ఎవరో చేసిన వ్యాఖ్యలను సాక్షి మీడియాకు అంటగట్టేందుకు పన్నాగం పన్నింది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అపోహలు సృష్టించేందుకు తెగబడింది. ఇదే అదునుగా ప్రజా గొంతుకను అణగదొక్కాలని పథకం వేసింది. అందులో భాగంగా పచ్చమూకను రెచ్చగొట్టింది. గూండాలను రంగంలోకి దించింది. సాక్షి కార్యాలయంపై దాడికి ఉసిగొల్పింది. సోమవారం సాయంత్రం ఈ మేరకు తిరుపతిలోని టీడీపీ నేతల ఆధ్వర్యంలో రేణిగుంటలోని సాక్షి యూనిట్ ఆఫీస్‌కు రౌడీమూక తరలివచ్చింది. గేటును తన్నుతూ లోపలికి చొరబడేందుకు యత్నించింది. రాళ్లు రువ్వుతూ భయానక వాతావరణం సృష్టించింది. అడ్డుకోబోయిన పోలీసులపై సైతం దౌర్జన్యానికి పాల్పడింది.



సాక్షి కార్యాలయంపై దాడికి తెగబడుతున్న టీడీపీ నేతలు, గూండాలు

ప్రజా గొంతుకపై రెచ్చిపోయిన పచ్చ మూక

- సాక్షి కార్యాలయంపై రాళ్లు రువ్విన గూండాలు
- గేటుని తన్నుతూ.. లోపలికి చొరబడేందుకు యత్నం
- టీడీపీ నేతల ఆధ్వర్యంలో దాడి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : రేణిగుంటలోని తిరుపతి సాక్షి యూనిట్ కార్యాలయంపై సోమవారం సాయంత్రం టీడీపీ మూక దాడికి తెగబడడంపై పలువురు మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో మాట్లాడిన మాటలను సాక్షి మీడియాకు చుట్టడడంపై మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులుగా ఉండి ఇంతటి అరాచకానికి పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దాడులతో సభ్య సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ప్రజలతో మమేకమై, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం సాగిస్తున్న సాక్షి పత్రికను నిలువరించేందుకే కుట్రలు చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజల గొంతుకగా సేవలందిస్తున్న పత్రిక కార్యాలయంపై దాడి చేయడమంటే, జనంపై దాడి చేయడమే అని స్పష్టం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్ల ఆధ్వర్యంలో రౌడీయిజం చేయడమేంటని నిలదీస్తున్నారు.

భగ్గుమన్న పాత్రికేయలోకం



చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సాక్షి పాత్రికేయ బృందం

రేణిగుంటలోని సాక్షి యూనిట్ కార్యాలయంపై పచ్చమూక వికృత చేష్టలను పాత్రికేయలోకం ఖండించింది. ప్రజా వాణిని వినిపించే పత్రికను అణచివేసేందుకే ఇలాంటి దిగజారుడు పనులకు దిగుతున్నారని భగ్గుమంది. దాడి చేసిన వ్యక్తులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల్లో సాక్షి విలేకర్లు ఆయా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. రౌడీమూకపై కేసులు నమోదు చేయాలని కోరారు. ఇదిలా ఉండగా యాదమరి పోలీస్ స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ ఫిర్యాదు తీసుకునేందుకు నిరాకరిస్తూ దురుసుగా ప్రవర్తించారు.



సాక్షి యూనిట్‌పై టీడీపీ మూక దాడిచేశారన్న సమాచారం తెలుసుకుని సాక్షి కార్యాలయం వద్దకు చేరుకున్న ఎంపీ గురుమూర్తి



సాక్షి కార్యాలయంపై రాళ్లు రువ్వుతున్న టీడీపీ నేత



లోపలికి చొరబడే యత్నం



మహిళలను ఉసిగొల్పుతున్న డిప్యూటీ మేయర్

సెక్షన్ 30 బేఖాతర్

రేణిగుంటలో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంది. ఈ చట్టం ప్రకారం ఆందోళనలు, నిరసనలు, ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. అయితే టీడీపీ నేతలు మాత్రం అధికారమే అండగా చట్టాన్ని అతిక్రమించారు. వందల మంది గూండాలతో కలిసి సాక్షి కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇష్టారాజ్యంగా దాడికి యత్నించారు. రోడ్డుపై బైఠాయించారు. చివరకు పోలీసులపై సైతం రౌడీయిజం చేశారు. అయినప్పటికీ పోలీసులు మాత్రం తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. టీడీపీ నేతలను దాదాపు బతిమాలుకుంటూ సాక్షి కార్యాలయం వద్ద నుంచి పంపించారు.

'సాక్షి'పై దాడి సరికాదు



రాష్ట్రంలో సాక్షి కార్యాలయాలపై జరుగుతున్న దాడులు సరికాదు. ఆ టీవీలో ప్రసారమైన అంశంపై చానల్ యజమాన్యం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ ఇలా కక్షగట్టి దాడి చేయడం పద్ధతి కాదు. ఉద్యోగులను భయాందోళన కలిగించాలనే ఉద్దేశంతో ఇలా చేస్తున్నారు.

– నాగరాజు, సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి

భౌతిక దాడులు అన్యాయం



'సాక్షి'పై కక్షకట్టి భౌతికంగా దాడులు చేస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించాలి కానీ కార్యాలయాలపై దాడి ఎంతవరకు సమంజసం. నిరసన పేరుతో భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో సంస్థ ఆస్తికి నష్టం కలుగుతుంది. అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు ఏం అవుతుందో అని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

– గంగరాజు, సీపీఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి

మీడియా స్వేచ్ఛను అణిచివేసే కుట్ర



నిరంతరం ప్రజాపక్షాన నిలిచి సమాజంలో అరాచకాలను, అక్రమాలను అరికట్టేందుకు ప్రయత్నిస్తున్న సాక్షి మీడియాపై టీడీపీ నేతలు విచక్షణా రహితంగా దాడి చేయడం ప్రజా స్వరాన్ని, మీడియా స్వాతంత్ర్యాన్ని అణిచివేసే కుట్ర. పత్రికా స్వేచ్ఛపై దాడులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించక కఠిన చర్యలు తీసుకోవాలి.

– ఎస్. జయచంద్ర, సీఐటీయూ తిరుపతి జిల్లా కార్యదర్శి

దాడి దుర్మార్గం



సాక్షి కార్యాలయాలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడడం దుర్మార్గమైన చర్య. టీడీపీ ప్రజావ్యతిరేక చర్యలకు పాల్పడడం విడ్డూరం. పొరబాటు జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. పత్రికా కార్యాలయంపై దాడులకు పూనుకోవడం రాజ్యాంగ విరుద్ధం. పోలీసులు కేసు నమోదు చేయాలి.

– వందవాసి నాగరాజు, సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి

దివ్యదర్శనం..దైవాధీనం

సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలతో తిరుపతికి తరలివచ్చే యాత్రికులకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కష్టతరంగా మారింది. భక్తి శ్రద్ధలతో కాలినడకన శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లాలనుకునే భక్తులు ఇకపై దివ్యదర్శనం టోకన్లు పొందడం దైవాధీనంగా మారుతోంది. టీటీడీ తీసుకుంటున్న పలు నిర్ణయాలు భక్తుల పాలిట శాపాలుగా మారుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు. ముందస్తుగా ఎలాంటి ప్రచారం లేకుండా అనూహ్యంగా చేపట్టే మార్పులు ఇబ్బందికరంగా పరిణమిస్తాయని స్పష్టం చేస్తున్నారు.

- శ్రీవారి మెట్టు మార్గంలో టోకెన్ జారీ కేంద్రం మార్పు
- అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో నూతన కౌంటర్లు ప్రారంభం
- టీటీడీ నిర్ణయంతో భక్తుల అయోమయం
- ముందస్తు ప్రచారం లేక అవస్థలు



తిరుపతిలోని అలిపిరి వద్ద దర్శన టోకెన్ల కోసం వేచి ఉన్న భక్తులు

తిరుపతి అన్నమయ్య సర్కిల్: శ్రీవారి మెట్టు నుంచి కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తులకు దివ్యదర్శనం టోకెన్ల జారీ కౌంటర్లను తాత్కాలికంగా మార్చుచేశారు. శ్రీవారి మెట్టు వద్ద నుంచి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్స్‌కి మారుస్తూ టీటీడీ చర్యలు చేపట్టింది. ఈమేరకు ఈ నూతన కౌంటర్లు అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లో అందుబాటులోకి తీసుకువచ్చింది.

పెరగనున్న రద్దీ

తిరుపతి నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీవారి మెట్టు వద్దకు యాత్రికులు చేరుకుని దివ్యదర్శనం టోకన్లు పొంది అక్కడి నుంచి నేరుగా కాలినడకన తిరుమలకు చేరుకునేవారు. అయితే అనూహ్యంగా టోకన్ జారీ కౌంటర్లను అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్‌కు మార్పుచేశారు. అసలే అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద అత్యధిక సంఖ్యలో యాత్రికుల రద్దీ ఉంటుంది. అలిపిరి నుంచి కాలినడక వెళ్లే వారు ఒకవైపు, అదే సమయంలో శ్రీవారిమెట్టు మార్గంలో వెళ్లే భక్తులు దివ్యదర్శనం టోకెన్ల కోసం ఇక్కడికి చేరుకోవడంతో రద్దీ మరింత పెరిగి కొత్త సమస్యలు తలెత్తే అవకాశముంది.

కాలినడక తప్పని తిప్పలు

శ్రీవారి మెట్టు మార్గంలో దివ్యదర్శనం టోకెన్ జారీ కేంద్రాల మార్పు సమాచారం తెలియని భక్తులకు తిప్పలు తప్పవు. . టోకెన్ జారీ కేంద్రాల మార్పు గురించి తెలియని వారు మొదట శ్రీవారి మెట్టుకు చేరుకుంటారు. అక్కడికి తిరుపతి నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉంది. విషయం తెలుసుకుని తిరిగి 15 కిలోమీటర్ల దూరంలోని అలిపిరి వద్ద రావాలి. టోకెన్లు పొందిన తర్వాత మళ్లీ 15 కిలోమీటర్లు ప్రయాణించి శ్రీవారి మెట్టు వద్దకు చేరుకోవాలి. దీంతో అదనంగా ప్రయాణ ఖర్చు పెరిగే ప్రమాదముంది.

ఊహించని పరిణామాలకు ఆస్కారం

దివ్యదర్శనం టోకెన్ల జారీ ప్రక్రియ లభ్యత మేరకు అనే విషయం భక్తులకు ప్రశ్నార్థకం కానుంది. శ్రీవారి మెట్టు చేరుకుని అక్కడి నుంచి వ్యయ ప్రయాసలతో అలిపిరి వద్దకు వచ్చి టోకెన్ పొందలేని వారు నిరుత్సాహానికి గురికావల్సిందే. ముందు వచ్చిన వారికి తొలి ప్రాధాన్యత ప్రాతిపదికన టోకెన్ల జారీ ప్రక్రియ చేపట్టనున్నారు. దీంతో భక్తుల మధ్య పోటీతత్వం ఏర్పడి ఊహించని పరిణామాలు చోటు చేసుకునేందుకు ఆస్కారం ఏర్పడుతుందని పలువురు విశ్లేషిస్తున్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద నిర్దేశించిన కౌంటర్లలో భక్తుల రద్దీ క్రమబద్ధీకరణలో వారి భద్రత, రాక పోకల్లో ఉత్పన్నమయ్యే ట్రాఫిక్ సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.





అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద టోకెన్ల కోసం బారులు తీరిన భక్తులు, టోకెన్ తీసుకుంటున్న భక్తులు

అవార్డులతో ప్రతిభకు ప్రోత్సాహం



విద్యార్థినికి అవార్డు అందిస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

తిరుపతి కల్చరల్ : ప్రతిభ గల విద్యార్థులు ప్రోత్సహించేందుకే ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. పదోతరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందించారు. మంత్రి మాట్లాడుతూ పేదరికం కారణంగా పిల్లలకు చదువుకు దూరం కాకూడదనే సదుద్దేశంతో ప్రభుత్వం విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఏపీని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ అమలు చేస్తోందని వెల్లడించారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యావ్యవస్థను అద్భుతంగా తయారుచేసేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తోందని వివరించారు. అందులో భాగంగానే ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకే షైనింగ్ స్టార్స్ అవార్డులను అందిస్తున్నట్లు వెల్లడించారు. సర్కారు పాఠశాలల్లో చదువుకుని ఉత్తమ మార్కులు సాధించి అవార్డు అందుకున్న విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం 207 మంది పదోతరగతి విద్యార్థులు, 40 మంది ఇంటర్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేశారు. అలాగే రూ.20వేల చొప్పున నగదు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, కోనేటి ఆదిమూలం, నేతలు సుగుణమ్మ, పసుపులేటి హరిప్రసాద్, డీఈఓ కేవీఎస్ కుమార్, సర్వశిక్ష అభియాన్ సీఎంఓ సురేష్ పాల్గొన్నారు.

అర్జీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వండి



వినతులను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్



సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పీజీఆర్ఎస్ నిర్వహించారు. జేసీతోపాటు డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, రోజ్‌మాండ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో 242 అర్జీలు వచ్చాయని వెల్లడించారు. అందులో రెవెన్యూ సమస్యలపై 129, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్-9, పంచాయతీ రాజ్ -14, పోలీస్ శాఖ -10 మిగిలిన విభాగాల్లో కొద్ది పాటి అర్జీలు వచ్చాయని వివరించారు. ప్రతి సమస్యకు పరిష్కారం చూపించే దిశగా చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 94 అర్జీలు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

క్లుప్తంగా

రేపు ఉపనిషత్తుల సందేశం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార సమితి సౌజన్యంతో బుధవారం స్థానిక అన్నమాచార్య కళామందిరంలో 12 గంటల పాటు నిరంతరాయంగా ఉపనిషత్తుల సందేశ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి సోమవారం ప్రకటన విడుదల చేశారు. పౌరాణిక శిరోమణి, ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ పొన్నా కృష్ణమూర్తి వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నట్లు అందులో పేర్కొన్నారు.

నృసింహుని హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

రాపూరు : పెంచలకోన క్షేత్రంలో వెలసిన పెనుశిల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. మొత్తం 34 రోజులకు గాను రూ.88,44,153 నగదు, 103 గ్రాముల బంగారం, 4.2 కేజీల వెండి వచ్చినట్లు ఆలయ ఏసీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

తిరుపతి డీపీటీఓగా జగదీష్

తిరుపతి అర్బన్ : జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీఓ)గా చిత్తూరు డీపీటీఓగా పని చేస్తున్న జగదీష్‌ను బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన తిరుపతి డీపీటీఓగా రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన గతంలో కొద్దికాలం తిరుపతి డీపీటీఓగా పని చేశారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్ పై భాగంలోని విశ్రాంతి హాల్‌లో నిద్రపోతూ సోమవారం వేకువజామున గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ వీఎంఎస్ నాయుడు(60) మృతి చెందారు. చిత్తూరు–2 డిపోలో పనిచేస్తున్న ఆయన పల్లెవెలుగు సర్వీస్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం దేవళంపేట నుంచి తిరుపతికి రాత్రి 9.30 గంటలకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 5 గంటలకు తిరుపతి నుంచి దేవళంపేటకు వెళ్లాల్సి ఉంది. దీంతో తిరుపతి బస్టాండ్ పై భాగంలోని విశ్రాంతి హాల్‌లో పడుకున్నారు. అయితే నిద్రలోనే ఆయన ప్రాణాలు కోల్పోయారు. పాకాల మండలం పేటమిట్టకు చెందిన నాయుడుకు భార్య,ముగ్గురు పిల్లలున్నారు.

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి సంకీర్తనలతో అలరారే తిరుపతి నగర ప్రతిష్ట మసకబారుతోంది. ప్రపంచ నలుమూలల నుంచి తరలివచ్చే భక్తులతో విలసిల్లే ఆధ్యాత్మిక క్షేత్రం మాదక ద్రవ్యాలకు అడ్డాగా మారిపోతోంది. సాక్షాత్తు వైకుంఠనాథుని పాదాల చెంత డ్రగ్స్ మహమ్మారి వికటాట్టహాసం చేస్తోంది. శాంతి భద్రతలు కాపాడాల్సిన ఖాకీలే కూటమి నేతల అండతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుండడం శ్రీవారి భక్తులను ఆందోళనకు గురిచేస్తోంది.

- ఆధ్యాత్మిక క్షేత్రంలో మాదక ద్రవ్యాల కలవరం
- కూటమి ప్రభుత్వంలో మసకబారిన తిరుపతి ప్రతిష్ట
- అధికార పార్టీ నేతల అండతో స్మగ్లర్లుగా మారిన ఖాకీలు
- ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ తెలంగాణ పోలీసులు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్రమ మద్యం, గంజాయిపై ఉక్కుపాదం



తిరునగరం.. డ్రగ్స్ కలకలం!

తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక నగరానికి మాదక ద్రవ్యాల మరకలు అంటుతున్నాయి. ఎన్నడూ లేని విధంగా డ్రగ్స్ మాఫియా మూలాలు తిరుపతి నగరంలో దొరకడం కలవరపాటు గురిచేస్తోంది. ఇప్పటివరకు గంజాయి మాత్రమే సరఫరా అవుతుందనే వినికిడి ఉండగా.. ఇప్పుడు కొత్తగా కొకైన్, ఎపిడ్రిన్ వంటి డ్రగ్స్ కూడా లభిస్తుండడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. తిరుపతి నుంచే హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా జరిగినట్లుగా కూకట్‌పల్లి పోలీసులు గుర్తించారు. ఇందులో తిరుపతికి చెందిన ఓ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో నగరంలో ప్రమాదకరమైన మాదక ద్రవ్యాల సరఫరా జరుగుతున్నాయనే విషయం బయటకు రావడంతో శ్రీవారి భక్తులు ఆవేదన చెందుతున్నారు. కూటమి సర్కారు వచ్చి ఏడాది అవుతుంది. ఇప్పటికే జిల్లాలో మద్యం, గంజాయి సరఫరా యథేచ్ఛగా సాగుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పుణ్యక్షేత్రంలోనే అధిక సంఖ్యలో వైన్ షాపులు వెలిశాయి. మరోవైపు కూటమి నేతల కనుసన్నల్లో బెల్ట్ షాపులు ఏర్పాటయ్యాయి. ఇష్టానుసారం పర్మిట్ రూములకు అనుమతులు ఇచ్చి 24 గంటలూ మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు.

ఎవరెవరు ఉన్నారో..?

ఇప్పటివరకు ఈ డ్రగ్స్ దందాలో హైదరాబాద్ పోలీసులు తిరుపతికి చెందిన కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఉన్నట్లు గుర్తించారు. వీరు కాకుండా ఇంకెవరైనా ఖాకీలు ఉన్నారా ? అనే కోణంలో తెలంగాణ పోలీసులు దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం. మత్తు పదార్థాలను కట్టడి చేయాల్సిన పోలీసులే నిందితులుగా మారుతున్నారంటే.. ఎంత పెద్ద మొత్తంలో నగదు చేతులు మారుతుందో ఆలోచించాల్సిన విషయం. అధికార పార్టీ నేతల అండదండలతోనే ఈ డ్రగ్స్ వ్యవహారంలోకి ఖాకీలు తలదూర్చినట్లు విశ్వసనీయ సమాచారం. విషయం బయట పడగానే వీరిద్దరిపై జిల్లా పోలీసు ఉన్నతాధికారి చర్యలు చేపట్టారు. విధుల నుంచి పూర్తిగా తొలగించారు. అయితే డ్రగ్స్ మూలాలు ఎక్కడెక్కడ ఉన్నాయి ? ఈ దందాలో ఇంకా ఎవరి హస్తం అయినా ఉందా అనే దిశగా జిల్లా పోలీసులు విచారణ చేపట్టకపోవడం దురదృష్టకరం. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముంది.

గత ప్రభుత్వంలో పటిష్ట భద్రత

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపింది. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చాలావరకు గంజాయి నిర్మూలనకు కృషి చేశారు. అక్రమ మద్యం, గంజాయి లేకుండా చేయడంలో సఫలీకృతమయ్యారు. తిరుపతి ప్రతిష్టను ఇనుమడింపజేశారు. అనునిత్యం తిరుపతి నగరంపై ప్రత్యేక దృష్టి సారించి భక్తులకు భరోసా కల్పించారు. అయితే కూటమి సర్కార్ వచ్చినప్పటి నుంచే ఆధ్యాత్మికక్షేత్రంలో అష్టదరిద్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కొత్తగా మాదక ద్రవ్యాల విక్రయాలు కూడా మొదలయ్యాయి. వీటి మూలాలను కూకటి వేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ఎక్కడి నుంచి వచ్చినట్టు ?

తిరుపతిలో తాజాగా డ్రగ్స్ దందా వెలుగులోకి రావడంతో నగర ప్రజలు కలవరపాటుకు గురయ్యారు. హైదరాబాదుకు కొకైన్, ఇతర డ్రగ్స్ తరలిస్తూ పట్టుబడిన కేసులో ప్రధాన నిందితులుగా తిరుపతికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు ఉండడం కూటమి ప్రభుత్వం, జిల్లా పోలీస్ శాఖ వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. బాధ్యత తీసుకోవాల్సిన కూటమి సర్కార్ ప్రతిపక్ష ఎంపీపై నింద మోపి చేతులు దులుపుకునే యత్నం చేయడం సిగ్గుచేటని తిరుపతి వాసులు మండిపడుతున్నారు.

నిఘా విభాగం ఏం చేస్తోంది ?

తెలంగాణ పోలీసులు వచ్చి తిరుపతిలో డ్రగ్స్ దందాను గుర్తిస్తే, జిల్లా పోలీసులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఎక్కడో బయట దేశాల్లో దొరికే కొకైన్, ఎపిడ్రిన్ వంటి వాటిని తిరుపతికి తెచ్చి.. ఇక్కడి నుంచి బయట రాష్ట్రాలకు రవాణా చేస్తుండడం విస్తుగొలిపే అంశం. ఇప్పటివరకు గంజాయి మాత్రమే లభ్యం అవుతోందనుకుంటే .. ఇక్కడి వారు డ్రగ్స్ కూడా వాడుతున్నట్లుగా బోధపడుతోంది.

'వేదిక్'లో నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ వర్సిటీలో 2025–26విద్యా సంవత్సరానికి యూజీ (శాస్త్రి), పీజీ (ఆచార్య), పలు సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారంతో ముగియనుంది. ఆసక్తిగల అభ్యర్థులు వర్సిటీలో పలు కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

టీటీడీ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వర (ఎస్వీ), శ్రీపద్మావతి మహిళా (ఎస్పీడబ్ల్యూ) జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఎస్వీ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్, తెలుగు మీడియంలలో కలిపి 792సీట్లకు దాదాపు 5,200మంది, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో 968సీట్లకు దాదాపు 9వేల మంది విద్యార్థినులు టీటీడీ వెబ్‌సైట్ ద్వారా సంబంధిత ధ్రువపత్రాలను సమర్పించి దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేసి వారికి సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 9నుంచి 12వ తేదీ వరకు మొదటి విడత అడ్మిషన్ల ప్రక్రియను టీటీడీ చేపట్టింది. తొలిరోజు ఆయా కళాశాలల్లో విద్యార్థులు ఆన్‌లైన్‌లో సమర్పించిన ధ్రువపత్రాలు పరిశీలించి అడ్మిట్ కార్డులను అందజేశారు. ఆర్ట్స్ గ్రూప్ విద్యార్థులు రూ.4,400/-, సైన్సు గ్రూప్ విద్యార్థులు రూ.5,350/-, హాస్టల్ సీట్లు పొందిన వారు హాస్టల్ ఫీజు చెల్లించి అడ్మిషన్లు పొందారు. అడ్మిషన్ల ప్రక్రియ, వాటికి సంబంధించిన ఏర్పాట్లను టీటీడీ డీఈఓ వెంకటసునీల్ పరిశీలించారు. ఎస్వీజేసీ, ఎస్పీడబ్ల్యూజేసీల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై నిరసన

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం చిగురువాడ పంచాయతీలో రూ.2.74 కోట్ల దుర్వినియోగంపైవార్డు సభ్యుడు ఎం.కిరణ్ కుమార్ రెడ్డి నిరసన తెలిపారు. సోమవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్ ప్రదీప్ కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. నిధుల దుర్వినియోగంపై గతంలో మాజీ ఉప సర్పంచ్ ఎ.సుబ్రమణ్యం రెడ్డి ఫిర్యాదు మేరకు రాష్ట్ర లోకాయుక్త విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చిందన్నారు. అయితే బాధ్యులపై చర్యలు తీసుకోకుండా అప్పట్లో కేసును తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. పంచాయతీ ఖర్చుల వివరాలు, చెల్లించిన బిల్లుల రికార్డులను పరిశీలిస్తే అవకతవకలు అర్థమవుతాయన్నారు. అందుకు అవసరమైన పత్రాలను అధికారులకు అందించారు. ఈక్రమంలోనే సర్పంచ్ అవినీతి, అక్రమాలపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, సీఎంకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎల్‌పీఓ నివేదిక ప్రకారం చిగురువాడ పంచాయతీలో రూ. 2.74 కోట్ల దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారణ అయినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై మండిపడ్డారు. ఇప్పటికీ అధికారులు స్పందించకుంటే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసి ఏసీబీ విచారణ కోరతానని స్పష్టం చేశారు. ఈ మేరకు అధికారులు మాట్లాడుతూ సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కిరణ్‌కుమార్ రెడ్డి

బత్తినయ్య సేవలో మోహన్‌బాబు

- 'కన్నప్ప' విజయం సాధించాలని ప్రత్యేక అభిషేక పూజలు

ఏర్పేడు: మండలంలో ముసలిపేడు సమీపంలోని భక్తకంశేశ్వరుడు(బత్తినయ్య) కోనను సినీనటులు మంచు మోహన్‌బాబు, మంచు విష్ణు సోమవారం దర్శించుకున్నారు. వారు నటించిన కన్నప్ప సినిమా విడుదల కానున్న నేపథ్యంలో మోహన్‌బాబుకు అత్యంత ఇష్టదైవమైన బత్తినయ్య కోనకు వెళ్లారు. ప్రత్యేక అభిషేక పూజలు చేసి పరమ శివుని భక్తునిపై తీసిన కన్నప్ప చిత్రం విజయం సాధించేలా కటాక్షించాలని ప్రార్థించారు.



పూజలు నిర్వహిస్తున్న మోహన్‌బాబు, విష్ణు

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

తిరుపతి సిటీ: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఇతర ఉద్యోగులకు జనవరి 2024 నుంచి జూలై 2025 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మూడు డీఏలను(మూల వేతనములో దాదాపు 12 శాతం) ప్రభుత్వం విడుదల చేయకపోవడం దారుణమని ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ వైబీ రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి వినతి పత్రాలను పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రకటన చేసిన డీఏలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏలను విడుదల చేయకపోవడంతో హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారని, వెంటనే విడుదల చేయాలని అత్యున్నత న్యాయస్థానాలు తీర్పునిచ్చాయని గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం వెంటనే డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఈనెల 19 జరిగే రాష్ట్ర క్యాబినెట్‌లో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


కక్షగట్టి అక్రమ కేసులు



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పరిపాలన పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను సాధించడం, వేధించడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇష్టారాజ్యంగా అక్రమ కేసులు బనాయిస్తోంది. అందులో భాగంగా తిరుపతి 14వ డివిజన్ ఎస్టీవీ నగర్‌లో టీడీపీ జెండా దిమ్మెకు కూటమి నేతలే వైఎస్సార్ సీపీ జెండా కట్టుకుని కుట్రకు తెరలేపారు. వైఎస్సార్‌సీపీ 14వ డివిజన్ అధ్యక్షుడు ఇరగం అనిల్‌రెడ్డి, కుటుంబీకులు ఇరగం శివారెడ్డి, ఇరగం వసంత, ఇరగం రవీంద్రారెడ్డి, సాయిపై ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో అక్రమ కేసులు కేసులు నమోదు చేయించారు. ఆదివారం రాత్రి పోలీసులు పిలిపించి కేసులు నమోదు చేసి బెదిరించినట్లు అనిల్‌రెడ్డి తెలిపారు. సోమవారం తమను అర్బన్ తహసీల్దార్‌కు బైండోవర్ చేశారని వెల్లడించారు. అయితే అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ఊపిరి ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని, భూమన అభినయ్‌రెడ్డి కోసమే పనిచేస్తామని తెలిపారు. అనిల్‌రెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు నమోదు చేయడంపై వైఎస్సార్‌సీపీ గ్రీవెన్ సెల్ నగర అధ్యక్షుడు మద్దాలి శేఖర్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఈస్ట్ పోలీస్‌స్టేషన్ వద్ద నిరసనకు దిగారు.

తెప్పపై సిరులతల్లి విహారం



తెప్పలో విహరిస్తున్న పద్మావతీదేవి (ఇన్‌సెట్) విశేషాలంకరణలో అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతీదేవి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా 3వ రోజు సోమవారం అమ్మవారు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం 3గంటలకు అమ్మవారిని పుష్కరిణి మధ్యలోని నీరాడ మండపంలో కొలువుదీర్చారు. అభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6.30గంటలకు అమ్మవారు తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలు చేస్తూ భక్తులను అనుగ్రహించారు.

రమణీయం..రథోత్సవం



మాడవీధుల్లో సాగుతున్న రథోత్సవం

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం ఉదయం స్వామివారి రథోత్సవం రమణీయంగా సాగింది. ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్నాల వీధి, భేరివీధి, గాంధీరోడ్డు మీదుగా ఆలయానికి చేరుకుంది. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణల నడుమ వైభవంగా కొనసాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. రథంపై ఉప్పు, మిరియాలు చల్లుతూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, నమ్మాళ్వార్ ఉత్సవర్లకు వేడుకగా స్నపన తిరుమంజనం జరిపించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వైభవంగా అశ్వవాహన సేవ చేపట్టారు. భక్తజన బృందాల కోలాటాలు, భజనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఎఫ్ఏ అండ్ సీఏఓ బాలాజీ, ఎస్ఈ–2 జగదీశ్వర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి పాల్గొన్నారు. ఈ క్రమంలోనే రథోత్సవంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ ఆధ్వర్యంలో భక్తులకు అరటి పండ్లు పంపిణీ చేశారు.

నేడు చక్రస్నానం

శ్రీగోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు (ఆళ్వార్ తీర్థం)లో స్నపన తిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు స్వామి, అమ్మవార్లు బంగారు తిరుచ్చిపై, చక్రతాళ్వార్ పల్లకిలో ఊరేగనున్నారు. రాత్రి 7 గంటలకు శ్రీవారు ఉభయ నాంచారులతో మాడ వీధుల్లో విహరించనున్నారు. రాత్రి 8.40 నుంచి 9.30 గంటల నడుమ ధ్వజావరోహణం, ఆస్థానంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి.

ఒకే బస్సు.. నలభై అడుగుల రోడ్డు!

- అభివృద్ధి పేరిట ఇళ్లకు మార్కింగ్ వేసిన అధికారులు
- నోటీసులు కూడా ఇవ్వకుండా కూల్చివేతలు



నిరసన తెలుపుతున్న ఐతేపల్లె వాసులు



ఎలాంటి నోటీసులు, సమాచారం లేకుండా దౌర్జన్యంగా ఇళ్లు, దుకాణాలను కూల్చుతున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి పేరిట అధికారులు చిత్రవిచిత్రాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే చంద్రగిరి మండలం ఐతేపల్లె– ఏ.రంగంపేట మార్గంలో ఒకే బస్సు తిరుగుతుంది. అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఏమాత్రం లేవు. అయితే రోడ్డు విస్తరణ పేరిట 5 రోజుల క్రితం రెవెన్యూ అధికారులు ఇళ్లకు మార్కింగ్ వేశారు. ఐతేపల్లె నుంచి ఏ.రంగంపేట వరకు 40 అడుగుల రోడ్డు పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏళ్ల నుంచి ఇళ్లు, దుకాణాలు నిర్మించుకుని ఇక్కడే జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు రోడ్డు విస్తరణ అంటూ కూల్చేస్తే తామంతా ఎలా బతకాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు మరో రెండు రోజుల్లో స్థానికులతో సమావేశం నిర్వహించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు వెల్లడించారు.

ఇష్టారాజ్యంగా దౌర్జన్యం

ఈ క్రమంలో సోమవారం అధికారులతో కలిసి కొంత మంది ఐతేపల్లెపై పడ్డారు ఆగమేఘాలపై జేసీబీలతో ఇష్టారాజ్యంగా ఇళ్లు, దుకాణాలను కూల్చేశారు. అసలు రోడ్డు విస్తరణకు పనులు ఎప్పుడు మంజూరు చేశారు..? వాటికి సంబంధించి అనుమతులు ఎవరు ఇచ్చారు..? అని ప్రశ్నిస్తే తమకు అదంతా తెలియదని, మార్కింగ్ చేసిన ప్రదేశం వరకు కూల్చేస్తామంటూ ధ్వంసం చేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేం దారుణమని అడిగితే బెదిరింపులకు పాల్పడినట్లుగా స్థానికులు తెలిపారు. కనీసం ఇళ్లు, దుకాణాలు కోల్పోయే బాధితులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యం చేయడంపై మండిపడ్డారు.

ఎవరూ లేని సమయంలో..!

రోడ్డు విస్తరణ నిర్వాసితులకు ఎలాంటి పరిహారం గురించి చర్చించకుండా, ఇళ్లలో ఎవరూ లేని సమయంలో దౌర్జన్యంగా కూల్చివేత పనులను చేపట్టడంపై ఐతేపల్లె వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలంటూ రోడ్డుపై నిరసనకు దిగారు. దౌర్జన్యంగా కూల్చివేతలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వంపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసినందుకు మా పొట్టకొడుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్గంలో ఉదయం, సాయంత్రం కేవలం ఒక్క బస్సు మాత్రమే వస్తుందని, అలాంటిది 40 అడుగుల రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. నిబంధనలకు పాటించకుండా దౌర్జన్యంగా కూల్చివేతలకు పాల్పడడం ఏంటని మండిపడ్డారు. బాధితులకు న్యాయం చేయకపోతే సహించేది లేదన్నారు.

జేసీ దృష్టిలోనే లేదంట..!

బాధితులు ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీ శుభం భన్సల్‌కు వినతి పత్రం సమర్పించారు. తమ గ్రామంలో రోడ్డు విస్తరణ పేరుతో అన్యాయంగా ఇళ్లు, దుకాణాలు కూల్చేశారని, తమకు న్యాయం చేయాలంటూ వేడుకున్నారు. దీనిపై స్పందించిన జేసీ మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు.

పుస్తకాల ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: కేంద్రీయ సంస్కృత వర్సిటీల నాలుగో ఉత్కర్ష మహోత్సవాల్లో తిరుపతి జాతీయ సంస్కృత వర్సిటీ అధ్యాపకులు రచించిన పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. మహారాష్ట్ర నాసిక్ నగరంలో చేపట్టిన ఉత్కర్ష మహోత్సవాల్లో ఎన్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అధ్యాపకుల బృందం పాల్గొంది. వీసీ మాట్లాడుతూ నేటి తరానికి భారతీయ సంస్కృతిని, జ్ఞానాన్ని అందించేందుకు విద్వాంసులు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎన్ఎస్‌యూ గణిత విభాగం అధ్యక్షులు రమేష్ బాబు రచించిన వేదిక్ మ్యాథమెటిక్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. చైతన్య ఫిలాసఫీ అనే గ్రంథాన్ని సైతం ఆవిష్కరించారు.

యువకుడి ఆత్మహత్య

రాపూరు : మద్దెలమడుగు వద్ద ఆదివారం రాత్రి రైలు కిందపడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్ఐ హరిచందన తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఒడిశాకు చెందిన అజయ్‌నాయక్ (20) ఓ దాబాలో వంట మాస్టర్‌గా పనిచేస్తుంటాడన్నారు. ఈ క్రమంలో కుటుంబ కలహాల కారణంగా గూడ్సు రైలు కిందపడినట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.